త్వరలో కొత్త రైల్వేలైన్లు

పార్వతీపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురం మీదుగా ఒడిశా నుంచి విశాఖపట్నం వరకు కొత్త రైల్వేలైన్లు ఏర్పాటు కానున్నా యి. దీనికి సంబంధించి డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) సిద్ధమవుతు న్నట్టు సమాచారం. ప్రయాణికుల రైళ్లతో పాటు విశాఖపట్నం-ఒడిశా-రాయ పూర్‌కు వివిధ రకాల సరుకులు రవాణా చేస్తున్న గూడ్స్ రైళ్లు ఎక్కువ కావడంతో కనీసం ఆరులైన్లు ఉండాలని రైల్వేశాఖ భావిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఉన్న లైన్లకు అదనంగా మరో రెండు లేదా మూడు లైన్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది.

సిద్ధమవుతున్న సీతానగరం వంతెన


పనులు జరుగుతున్న దృశ్యం

- 80 శాతం పనులు పూర్తి
- త్వరలో అందుబాటులోకి
- ప్రజలకు తప్పనున్న కష్టాలు

పార్వతీపురం, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండల కేంద్రంలోని సువర్ణముఖి నదిపై చేపడుతున్న వంతెన పనులు సుమారు 80 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా త్వరలోనే పూర్తిచేసి వంతెన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. బొబ్బిలి-రాయ గడ అంతర్రాష్ట్ర రహదారిపై సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ కొత్త వంతెన నిర్మాణానికి అడుగులు పడ్డాయి. దీనికోసం అప్పట్లో రూ.12 కోట్లు మంజూరయ్యాయి. ఇంతలోనే వైసీపీ అధికారంలోకి రావడంతో వంతెన నిర్మాణానికి బ్రేక్ పడింది. ఈలోపు పాత వంతెన మరింత అధ్వానంగా మారింది. దీంతో వైసీపీ ప్రభుత్వం 2020లో కొత్త వంతెనకు శ్రీకారం చుట్టింది. పాతవం తెనకు కూడా మరమ్మతులు చేపట్టి అప్రోచ్‌రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే, బిల్లులు చెల్లించక పోవడంతో కొత్త వంతెను పనులను కాంట్రాక్టర్ నిలిపివేశాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి, పనులు పునః ప్రారంభమయ్యే విధంగా చర్యలు చేపట్టింది. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం వంతెన నిర్మాణం 80శాతం పూర్తయింది. సైడ్ వాల్స్ నిర్మాణం వంటి చిన్నచిన్న పనులే మిగిలి ఉన్నాయి. మరో నెల రోజుల్లో వంతెన అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల ప్రయాణి కులు, వాహనచోదకులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

రైల్వేగేట్ల కష్టాలకు చెక్..

ఉమ్మడి జిల్లాలోని సీతానగరం, బొబ్బిలి, మానాపురం రైల్వేగేట్ల వల్ల ప్రజలు గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైళ్ల రాకపోకల సమయంలో ఈ గేట్లను వేసేవారు. దీని వల్ల గంటలకొద్దీ రైల్వేగేట్లకు ఇరువైపులా వాహనాలు బారులు తీరేవి. అయితే, ఇప్పటికే సీతానగరం, బొబ్బిలి రైల్వేగేట్ల వద్ద వంతెనలు నిర్మించడంతో వాహనదారులకు కష్టాలు తొలగాయి. తాజాగా మానాపురం వంతెన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడంతో ఇక్కడ కూడా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి. గతం టీడీపీ ప్రభుత్వ హయాంలో పార్వతీపురం వద్ద రైల్వే ఫ్లైఓవర్‌ను నిర్మించగా, కూటమి ప్రభుత్వంలో సీతానగరం, మానాపురం వంతెనలు అందుబాటులోకి వచ్చాయి.

పారాది వంతెన..

విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పారాది వద్ద (మిగతా 8వ పేజీలో..)

మినీ వంతెన కల నెరవేరేదెప్పుడో?


వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువన కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద

- ఐదు దశాబ్దాలుగా గిరిజనుల ఎదురుచూపు
- వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు వరదొస్తే 30గ్రామాలకు రాకపోకలు బంద్
- ప్రభుత్వంపైనే ఆశలు

జియ్యమ్మవలస, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వట్టిగెడ్డ రిజర్వాయర్.. ఇది జియ్యమ్మవలస మండలం ప్రధాన సాగునీటి వనరు. మొత్తం 16,684 ఎకరాలకు సాగునీరందించే రిజర్వాయర్. అయితే, వర్షా కాలంలో రిజర్వాయర్‌లో వరద ఉధృతమైతే తూర్పు ప్రాంత ఏజెన్సీ గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. రిజర్వాయర్ దిగువన మినీ వంతెన నిర్మాణం కోసం గిరిజనులు ఐదు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులకు ఎన్నో వినతులు ఇచ్చారు. అయినా ఫలితం శూన్యం. వంతెన నిర్మాణం నేటికీ కలగానే మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వ పెద్దలు గాని, జిల్లాకు వచ్చిన కొత్త కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి గాని స్పందించి మినీ వంతెన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటారా? అని ఈ ప్రాంత గిరిజనులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వరదొస్తే అంతే..

జియ్యమ్మవలస మండలంలోని తూర్పు ఏజెన్సీ ప్రాంతంలో టీకే జమ్ము (తామరకండి జమ్ము), పెదతోలుమండ, కొండచిలకాం, అలమండ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో కూటం, పాండ్రసింగి, కోడిపిల్లగూడ, గొర్లి, గొర్లివలస, టీకే జమ్ము, నడిమిసిరిపి, పల్లపుసిరిపి, జమ్మువలస, పీటీ మండ, బాపన్నగూడ, దీసరిగూడ, చాపరాయిగూడ, పెదదోడిజ, ద్రాక్షిణి, చినదోడిజ, చిలకాంవలస, కొండచిలకాం, బల్లేరుగూడ, బల్లేరు, కిడిగేసు, కొండనిడగళ్లు, నిడగళ్లుగూడ, రావాడ రామభద్రపురం, ఎస్సీ మరువాడ, ఎస్టీ మరువాడ, చినతోలుమండ, చినతోలుమండగూడ, నీలకంఠాపురం, అలమండ అనే 30 గిరిజన గ్రామాలు ఉన్నాయి. దాదాపు వెయ్యి గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరిలో 90 శాతం గిరిజనులు కొండలో పండిన సీతాఫలం, చింతపండు, జామ, సపోట, తదితర పంటలను కురుపాం, గుమ్మలక్ష్మీపురం, గొరడ గ్రామాల్లో జరిగే వారపు సంతలకు తెచ్చి అమ్ముకుంటూ ఆ డబ్బులతో జీవనాన్ని సాగిస్తూ ఉంటారు. ఈ పంటలన్నీ వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువన ఉన్న కాజ్‌వే (మిగతా 8వ పేజీలో..)

పారదర్శకంగా బార్ల కేటాయింపు

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి


బార్ల కేటాయింపు కోసం లాటరీ తీస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓపెన్ కేటగిరీలో బార్లను లాటరీ విధానంలో పారదర్శకంగా కేటాయించినట్టు కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో బార్ల కేటాయింపు ప్రక్రియ కలెక్టర్ చాంబర్‌లో గురువారం జరిగింది. బార్ల కోసం నాలుగు దరఖాస్తులు అందగా, లాటరీ ద్వారా దరఖాస్తుదారులందరికీ నెంబర్లను కేటాయించారు. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.20.4 లక్షల ఆదాయం వచ్చినట్టు జిల్లా అబ్కారీశాఖ పర్యవేక్షకుడు బి.జీవన్‌కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో అబ్కారీ శాఖ సహాయ పర్యవేక్షకుడు ఎ.సంతోష్, ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ శేఖర్‌బాబు, ఎస్‌హెచ్‌వో జి.దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

డోలీ మోతలు ఉండకూడదు..

'జిల్లాలో డోలీ మోతలు ఉండకూడదు. అన్ని గిరిజన గ్రామాలకూ రహదారుల సౌకర్యం కల్పించాలి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.' అని కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జేసీ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన అధికారులతో గురువారం సమీక్షించారు. ఇప్పటికీ డోలీ మోతలు ఉండడం బాధాకరమన్నారు. కొమరాడ, పాచిపెంట, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, భామిని, సీతంపేట, జియ్యమ్మవలస మండలాల్లో 264 గ్రామాలను గుర్తించామన్నారు. వాటికి ప్రాధాన్యతనిస్తూ ఇంజనీరింగ్ అధికారులు వీలైనంత త్వరగా రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా (మిగతా 8వ పేజీలో..)

స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెం బరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగానే బంగారు కుటుంబాల దత్తత ఉంటుందని, మార్గదర్శి నిర్ణయమే ముఖ్యమని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పీ-4 బంగా రు కుటుంబాల దత్తతపై వార్డు సచివాలయ సి బ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ప్రణాళికాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేసీ పాల్గొని మాట్లాడారు. బంగారు కుటుంబాల దత్తతకు మార్గదర్శకులు ముందుకు రావాలని కోరారు. 'ఇందులో ఎటువంటి ఒత్తిడి లేదు. వారు స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగానే రావచ్చు. అలాంటి వారిని మార్గదర్శిగా ఎంపిక చేస్తాం. మార్గదర్శకులకు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలి. మార్గదర్శకుల ఎంపికకు ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. దానిని తప్పకుండా పాటించాలి. వారివల్ల బంగారు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక స్పృహ కూడా ఉండాలి. బంగారు కుటుంబాలకు ఆర్థికంగా లేదా ఇతర సహాయ సహకారాలను అందించి మార్గదర్శి ఆదుకోవచ్చు. ఈ విషయంపై మార్గదర్శికి అవగాహన కల్పించి వారి పేర్లను పీ-4లో నమోదు చేయాలి.' అని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రణాళికాధికారి ఎస్.ఎస్.ఆర్.కె.పట్నాయక్, స్టాటిస్టికల్ రాష్ట్ర పరిశీలకుడు లతీఫ్, రాష్ట్ర శిక్షకులు శ్రీనివాస్, జిల్లా ప్రణాళికా కార్యాలయ సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయనగరం కలెక్టర్ రామసుందర్ రెడ్డి

పండగ శోభ ప్రతిబింబించాలి

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా వీఐపీ దర్శనాలు
- పైడితల్లి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రతిఒక్కరి మదిలో నిలిచిపోయేలా అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించి పండగ శోభను ప్రతిబింబించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి సూచించారు. ప్రతిదశలోనూ సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అమ్మవారి పండగ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశమందిరంలో అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని, సిరిమాను పవిత్రతను కాపాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. వీఐపీ దర్శనాల వల్ల సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. సిరిమాను తిరిగే ప్రదేశంలో ఎక్కడా రోడ్డుపై గుంతలు లేకుండా చూడాలని, అలాగే పారిశుధ్యం, రక్షిత తాగునీటి సరఫరా, బయో టాయిలెట్స్ ఏర్పాటు, నగరమంతా సుందరీకరణ, విద్యుత్ అలంకరణ తదితర పనులను మున్సిపల్ శాఖ వారు చూడాలని సూచించారు. పండగలో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చూడాలని, క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసిన తాగునీరు పేపర్ గ్లాస్‌ల ద్వారా అందించాలని చెప్పారు. ప్రసాదాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేయాలని, అన్ని ఆర్వో ప్లాంట్లను ఆర్‌డీవో ఆధ్వర్యంలో తనిఖీ చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి, అత్యవసర చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రధానంగా 6, 7 తేదీల్లో తొలేళ్లు, సిరిమాను ఉత్సవం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు వస్తారని, శాంతి భద్రతలకు సమస్య రాకుండా చూడాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బార్‌కేడ్ల ఎత్తు పెంచాలని, లేదంటే పైనుండి దూకి వస్తున్నారని పోలీస్ వారు చేసిన విజ్ఞప్తి మేరకు 4 అడుగుల నుండి 5 అడుగులకు పెంచాలని ఆర్ అండ్‌బీ అధికారులకు సూచించారు.

అసెంబ్లీలో మనవాణి

- సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు
- పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి


6లో

వెయిట్ లిఫ్టింగ్‌లో అజేయంగా..

- తండ్రి బాటలో రాణిస్తున్న తనయుడు
- కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం


6లో

వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్ రుసుం తగ్గింపు

- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

6లో

డీఎస్సీ ఉద్యోగ పత్రాల పంపిణీ వాయిదా

- వర్షాల కారణంగా కార్యక్రమం రద్దు


వర్షంతో అమరావతిలో తడిసిన వేదిక ప్రాంగణం

సాలూరు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన వారికి నియామక పత్రం అందించేందుకు అమరావతిలో శుక్రవారం తలపెట్టిన కార్యక్రమం రద్దు అయింది. వర్షాల కారణంగా కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు సంబంధిత అధికారులు ప్రకటించారు. అమరావతి వెళ్లేందుకు గురువారం ఉదయమే ఉమ్మడి జిల్లాకు చెందిన కొత్త గురువులు డెంకాడ మండలం మోదవలసకు చేరుకున్నారు. కొందరు తమకు కేటాయించిన బస్సుల్లో ఆశీనులయ్యా రు. మరికొద్ది నిమిషాల్లో బస్సులు బయలుదేరుతాయనగా అధికారులు మైక్‌లో ఓ ప్రకటన విడుదల చేశారు. అమరావతిలో వర్షాల కారణంగా ఉద్యోగ పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా వేశారని, మరో తేదీని ప్రకటిస్తారని చెప్పారు. చివరి క్షణంలో ప్రయాణం రద్దు కావడంతో కొత్త టీచర్లు తీవ్ర నిరాశకు గురయ్యారు.

ప్రాణం తీసిన పరుగు

- కల సాకారం కాకముందే తనువు చాలించిన యువకుడు
- శోకసంద్రంలో తల్లిదండ్రులు


సాయికిరణ్(ఫైల్)

విజయనగరం క్రైం/గరుగుబిల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీకి ఎంపికవ్వాలని కలలుగన్న ఆ యువకుడు సెలక్షన్స్ కోసం ఎదురుచూశాడు. తోటి స్నేహితులతో కూడా ఇదే విషయం చెప్పేవాడు. ఎంపిక పోటీల తేదీలు ప్రకటించాక చాలా ఆనందపడ్డాడు. తానొకటి తలస్తే విధి మరోలా చేసింది. పోటీలకు ఎంతో ఉత్సాహంగా హాజరై పరుగులు పెడుతున్న అతన్ని అర్థాంతరంగా ఆపేసింది. కల సాకారం కాకముందే మృత్యుఒడికి తీసుకెళ్లిపోయింది. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన పాలవలస సాయికిరణ్ విషాదాంతమిది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన పాలవలస పోలినాయుడు, సుజాత దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుమార్తె శ్రవంతికి పెళ్లి అయింది. కుమారుడు పాలవలస సాయికిరణ్(19) విజయనగరంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగు కళాశాలలో బీటెక్ ఈఈఈ రెండో ఏడాది చదువుతున్నాడు. గురువారం ఉదయం కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు జరుగుతుండడంతో హాజరయ్యాడు. ఎన్‌సీసీ అధికారులు చేపట్టిన ఎంపిక పోటీల్లో తొలుత పరుగు పందెం పెట్టగా పాల్గొని పరుగెడుతూ కొంత దూరం వెళ్లాక ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే కళాశాల యాజమాన్యం యువకుడిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. టూటౌన్ సీఐ టి.శ్రీనివాస్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కళాశాల యాజమాన్యంతో పాటు ఎన్‌సీసీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేంద్రాసుపత్రికి తరలించారు. సాయికిరణ్ తల్లిదండ్రులు బంధువులు అంతా జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారింది. అందొచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

దగ్గర్లో ఉంటాడని తీసుకొస్తే..

కుమారుడు తనకు దగ్గర్లో ఉంటాడని, దూరం నుంచి తీసుకొచ్చానని సాయికిరణ్ తండ్రి పాలవలస పోలినాయుడు వాపోయాడు. గుంటూరులో పాలిటెక్నిక్ చదువుకున్నాడని, కాకినాడలో ఇంజనీరింగ్ సీటు వచ్చినా తమకు దగ్గర్లో ఉంటాడన్న ఉద్దేశంతో రెండు నెలల క్రితమే విజయనగరం కళాశాలలో చేర్చానని ఆవేదన వ్యక్తం చేశాడు. 15 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి రెండు రోజుల పాటు తమతోనే ఉన్నాడని కన్నీరుమున్నీరయ్యాడు.

- సాయికిరణ్ కుప్పకూలి మరణించినట్లు తెలుసుకున్న తోటి విద్యార్థులు కేంద్రాసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. తమ స్నేహితుడు విగతజీవిగా మారడంతో వారి దుఃఖానికి అవధుల్లేకుండా పోయాయి. సాయంత్రం వరకూ వారంతా జిల్లా కేంద్రాసుపత్రి వద్దే ఉన్నారు.

ఉద్దవోలులో విషాదం

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలోని ఉద్దవోలు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన పాలవలస సాయికిరణ్ (19) గురువారం ఉదయం విజయనగరంలో గుండెపోటుతో మృతిచెందినట్లు తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పాఠశాల స్థాయి నుంచి చదువులో ప్రతిభ కనబరిచి మంచి విద్యార్థిగా స్థానికంగా గుర్తింపు పొందాడు. ఊరు వచ్చినప్పుడు వ్యవసాయ పనుల్లో తండ్రికి సహకరిస్తుండేవాడు. ఇదంతా చూసిన గ్రామస్థులు సాయికిరణ్ మృతిని తట్టుకోలేకపోయారు.


రోదిస్తున్న బంధువులు

పట్టణ వాసులకు ఆహ్లాదం ఎక్కడ?

- జిల్లా కేంద్రంలో ఒకే ఉద్యానవనం
- వృథాగా పార్కులకు కేటాయించిన స్థలాలు

8లో



అసెంబ్లీలో మనవాణి

- సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యేలు
- పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో మన జిల్లా ఎమ్మెల్యేలు తమ గళం వినిపించారు. తమ నియోజకవర్గాల పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. వాటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని... సంబంధిత మంత్రులను కోరారు. అలాగే ఉమ్మడి జిల్లా మంత్రులు వివిధ అంశాలపై మాట్లాడారు.

పింఛన్లను పెంచిన ఘనత చంద్రబాబుదే

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గజపతినగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారి పింఛన్లను తొలగించలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీపై గురువారం శాసన మండలిలో వైసీపీ సభ్యులు రమేష్, భరత్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. 'సామా జిక పింఛన్లను రూ.200నుంచి రూ. వెయ్యి చేసింది, రూ. వెయ్యి నుంచి రూ.2000కు, రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచింది సీఎం చంద్రబాబు నాయుడు హయాం లోనే అని చెప్పేందుకు సంతోషిస్తున్నా. గత ప్రభుత్వం పింఛను పెంపునకు నాలుగేళ్ల సమయం తీసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలతో కలిపి అందించింది. ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల దినోత్సవం'గా భావించి పింఛన్లు అందిస్తున్నాం. కలెక్టర్లకు గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల మేరకు కొందరికి పింఛన్లు నిలిపివేశాం. అనర్హులకు నోటీసులు ఇచ్చి 2 నెలల్లో రీవెరిఫి కేషన్ చేయాలని వైద్యశాఖకు సూచించాం. గత ప్రభుత్వం 60 లక్షల18 వేల మందికి అందజేసింది. కూటమి ప్రభుత్వం 63 లక్షల70 వేల పింఛన్లు అందిస్తోంది. భర్తలను కోల్పోయిన 1.80లక్ష ల మందికి కొత్త పింఛన్లు అందిస్తున్నాం. గతంలో ఒక నెలలో పింఛను తీసుకోకపోతే రద్దయ్యేద'ని మంత్రి శ్రీనివాస్ తెలిపారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులకు పెద్దపీట

- మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రాధాన్యం కల్పిస్తున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చినట్టు తెలిపారు. మినీ కేంద్రాల్లో పదో తరగతి పాసైన వారికి టీచర్లుగా నియమించామని తెలిపారు. వీటిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్టు వివరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రెండోసారి పదవి చేపట్టినపుడే అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచినట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం రూ.వెయ్యి మాత్రమే పెంచారన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.11,500 అందుకుంటున్నారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్‌కు రూ.7 వేలు జీతం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బందికి గ్రాట్యుటీ ప్రకటించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కిందన్నారు. వారికి పదవీ కాలం 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచామని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

నానో యూరియాపై అవగాహన కల్పించండి

- ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగానికి సంబంధించి రైతుల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. గురువారం అసెంబ్లీలో దీనిపై మాట్లాడారు. 'యూరియా లభ్యత విషయంలో రైతాంగం కొంత ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. దీనికి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడుకోవాలని ప్రచారం చేస్తున్నాం. రైతుల్లో దీనిపై ఉన్న అపోహలను తొలగించాల్సి ఉంది. 50 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ చేసే పనిని ఓ ఐదు లీటర్ల నానో లిక్విడ్, లేదా సాలిడ్ ఎలా చేస్తుందనేది రైతుల వాదన. వ్యవసాయ శాస్త్రవేత్తలు, పెద్ద రైతులు నిపుణుల అభిప్రాయం ప్రకారం 50 కిలోల యూరియా లేదా పాస్ఫేట్‌కు ఇంచుమించు సమానంగా 5 కిలోల నానో ఎరువు ఫలితాలనిస్తుంది. అంతకన్నా మించి యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించిన వారమవుతాం. నానో ఎరువు వాడకానికి సంబంధించి ఓ యజ్ఞంలా పెద్దఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం, అవగాహన కల్పించాలి. ఈ ఖరీఫ్ సీజన్ ముగిసిన నాటి నుంచి రాబోయే రబీ సీజన్‌లో ఈ ఉద్యమాన్ని చేపట్టాలి. అలా అయితే వచ్చే ఏడాది పంట కాలంలో యూరియా కోసం రైతులు ఎటువంటి అవస్థలు పడాల్సిన అవసరం ఉండదని అన్నారు.

వారికి కూడా వితంతు పింఛన్లు ఇవ్వండి..

- ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



విజయనగరం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వితంతు పింఛన్లను 2019కి ముందు భర్తలను కోల్పోయిన మహిళలకు కూడా ఇవ్వాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. ఈ మేరకు ఆమె గురువారం అసెంబ్లీలో మాట్లాడారు. విజయనగరంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో ఈ సమస్య ఉందన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.



స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు వరద ప్రవాహం ఇలా...

తగ్గుతూ.. పెరుగుతూ...

గరుగుబిల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టులో నాగావళి వరద ప్రవాహంలో హెచ్చు తగ్గులు నమోదయ్యాయి. గురువారం ఎగువ నుంచి 10 వేల క్యూసెక్కులకు పైగా వరద ప్రాజెక్టులోకి చేరింది. దీంతో అధికారులు స్పిల్‌వే గేట్లు నుంచి దిగువ ప్రాంతాలకు 5 వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గానూ 104.52 మీటర్ల నిల్వ ఉంది. అలాగే సాగునీటి అవసరాల నిమిత్తం 1,320 క్యూసెక్కులు ప్రధాన కాలువల నుంచి సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా బుధవారం 4,900 క్యూసెక్కులు చేరగా, దిగువ ప్రాంతాలకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే గురువారం 4,900 క్యూసెక్కుల నుంచి 10 వేల క్యూసెక్కులకు చేరుకుంది.

వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్ రుసుం తగ్గింపు

- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు

బొబ్బిలి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వారసత్వంగా వస్తున్న ఆస్తులను తమ వారసులకు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రభుత్వం రుసుమును తగ్గించిందని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్రరావు అన్నారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.10 లక్షల లోపు వారసత్వపు ఆస్తులకు రూ.వంద, రూ.పది లక్షలు దాటిన ఆస్తులకు రూ.వెయ్యి చొప్పున రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆదేశాలు వెలువడాల్సి ఉందన్నారు. జిల్లాలో గత ఏడాది కన్నా ఈ ఏడాది రిజిస్ట్రేషన్ కార్యకలాపాల్లో 40 శాతం పెరుగుదల ఉందని వివరించారు. విజయనగరం, కొత్తవలస మినహా మిగిలిన అన్ని ప్రాంతాలలో 90 శాతం రిజిస్ట్రేషన్ లక్ష్యాలను సాధించామని తెలిపారు. ఏ రోజుకారోజే డాక్యుమెంట్లను అందజేస్తున్నామని వివరించారు.

అందుబాటులో స్టాంపులు..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని రకాల స్టాంపులను అందుబాటులో ఉంచామని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు తెలిపారు. ఈ-స్టాంపులకు ఆదరణ పెరగాల్సి ఉందన్నారు. పాడైన భవనాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు అన్ని రకాల డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నదీ లేనిదీ సరిచూసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు, ఇతరత్రా వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్లు జిల్లాలో జరగలేదని ఆయన స్పష్టం చేశారు. చాలా గ్రామాలలో ఆస్తి విలువను తగ్గించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఆనవాయితీగా వస్తోందని... వాస్తవిక విలువ ఆధారంగా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. లేకుంటే భవిష్యత్‌లో సాంకేతికపరంగా సమస్యలు తలెత్తుతాయని.. ఆర్థికంగా నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు హితవు పలికారు. ఆయన వెంట స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ఎ.శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఉపేంద్రరావు, శ్రీనివాస్

వెయిట్ లిఫ్టింగ్‌లో అజేయంగా..

- తండ్రి బాటలో రాణిస్తున్న తనయుడు
- కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం

నెల్లిమర్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆ కుర్రాడు తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని పతకాల వేటలో ముందుకు సాగుతున్నాడు. వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లా.. రాష్ట్ర.. దేశ సరిహద్దులు దాటి.. అంతర్జాతీయ వేదికలపై మన కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్నాడు. ఆ కుర్రాడి పేరు వల్లూరి అజయ్‌బాబు. ఆయన తండ్రి వల్లూరి శ్రీనివాసరావు. కొండవెలగాడ గ్రామానికి చెందిన శ్రీనివాసరావు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్‌లో అనేక పతకాలు సొంతం చేసుకున్నాడు. ఇండియన్ ఆర్మీలో సిపాయి స్థాయి నుంచి జేవీవో కేడర్ వరకు ఎదిగి ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేశారు. గ్రామంలోనే ఉంటూ మరింకొంత మంది క్రీడాకారులను తయారు చేస్తున్నారు. వల్లూరు శ్రీనివాసరావు పెద్ద కుమారుడు అజయ్‌బాబు తండ్రి విజయాలను స్ఫూర్తిగా తీసుకొని తన 8వ ఏట నుంచే వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన ప్రారంభించాడు. 2021లో జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలో యూత్ విభాగంలో తొలి స్వర్ణం సాధించాడు. 2022 జూలైలో ఉజ్బెకిస్తాన్, 2022 అక్టోబర్‌లో బహ్రెయిన్, 2023లో యూపీ (ఇండియా), 2024 డిసెంబర్‌లో ఖతర్, ఉజ్బెకిస్తాన్, అదే ఏడాది సెప్టెంబర్‌లో ఫిజిలో వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో సత్తా చాటాడు. ప్రస్తుతం పాటియాలాలోని ఓ అకాడమిలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రిని ఆదర్శంగా తీసుకున్న అజయ్‌బాబు వరుస విజయాలు సాధిస్తూ మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం

వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాణిస్తున్న అజయ్‌బాబు క్రీడల కోటాలో ఇటీవల ఆర్మీలో జేఏఓ కేడర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. త్వరలో విధుల్లో చేరనున్నాడు. శిక్షణకు సంబంధించి అకాడమి ఖర్చులు భరిస్తున్నప్పటికీ.. అదనంగా నెలకు రూ.40 వేల వరకు అదనంగా ఖర్చు అవుతున్నట్టు తండ్రి శ్రీనివాసరావు చెబుతున్నారు. ఆర్థికంగా ప్రోత్సాహం అందితే తన కుమారుడు మరిన్ని పతకాలు సాధించడంపై దృష్టి పెట్టగలడని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



బంగారు పతకంతో అజయ్‌బాబు

స్కాట్‌లాండ్ పోటీలకు ఎంపిక

ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్ పోటీల్లో అజయ్‌బాబు స్వర్ణ పతకం సాధించాడు. దీంతో 2026 జూలై 23 నుంచి స్కాట్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ పోటీల్లో తన కుమారుడు తప్పనిసరిగా స్వర్ణం సాధిస్తాడని తండ్రి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రామతీర్థంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామివారి దేవస్థానంలో స్వామి వారి పవిత్రోత్సవాలు మూడో రోజు గురువారం ఘనంగా కొనసాగాయి. అర్చక బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత బాలభోగం, తీర్థగోష్ఠి కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత జపాలు, హవనాలు నిర్వహించారు. రుత్విక్కులతో శ్రీమద్రామాయణ పారాయణ, సుందరకాండ పారాయణ, దివ్య ప్రబంధ సేవకాలాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం విశేష హోమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలు అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, ఖండవిల్లి కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణింగపల్లి ప్రసాద్, పవన్ కుమార్, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పవిత్రాలను తీసుకెళుతూ...

అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల్లో సంతృప్తి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) అభివృద్ధి, సంక్షేమంతో సమంగా ముందుకు సాగితే ప్రజలు సంతృప్తి చెందుతారని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనలను జిల్లా అధికారులకు వివరించారు. ప్రభుత్వ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలో ఉన్న గ్రీవెన్స్‌లను సక్రమంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీటి సదుపాయం, గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ సేతు మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు..

జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో రైతులను తప్పుదారి పట్టించే విధంగా కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గజపతినగరం, తదితర ప్రాంతాల్లో అవసరమైన ఎరువులు ఉన్నాయని ఆయన చెప్పారు.

భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి..

జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు ఇప్పటి వరకూ జీఎంఆర్‌కు అప్పగించిన 2,200 ఎకరాల భూముల పరిస్థితిని తెలుసుకున్నారు. రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించండి

- ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీవో

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఇప్పటి నుంచే దృష్టిసారించాలని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. గురువారం ఆయన పాలకొండ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో అన్ని గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో 60 శాతానికి కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి అదనపు తరగతులను నిర్వహించాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు నిత్య తోరణం.. నేడు సమస్యలతో రణం

- ఇదీ పైడిమాంబ కల్యాణ మండపం దుస్థితి



కల్యాణ మండపం వద్ద పడి ఉన్న చెట్ల కొమ్మలు

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు కళకళలాడే కల్యాణ మండపం నేడు అధ్వాన్నంగా తయారైంది. నాడు నిత్య కల్యాణం... పచ్చ తోరణం అన్న చందంగా తరచూ కల్యాణాలు.. వేడుకలకు వేదికయ్యేది. నేడు బోసిపోతోంది. ఇదీ ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లమ్మవారి కల్యాణ మండపం దుస్థితి. స్థానిక శివాలయం వీధిలో ఉన్న ఈ మండపంలో గతంలో పైడితల్లమ్మ ఆలయ ఈవో కార్యాలయం, ఆలయ నిర్వహణ సిబ్బంది విధులు ఇక్కడే నిర్వహించే వారు. పైడిమాంబ అన్నదాన కార్యక్రమం కూడా ఈ కల్యాణ మండపంలోనే జరిగేది. ఆలయ నిర్వహణ బాధ్యతల సంగతి ఎలా ఉన్నా... ఈ కల్యాణ మండపాన్ని గతంలో ప్రైవేటు వ్యక్తులకు వివిధ వేడుకలు, కార్యక్రమాలకు అద్దెకు ఇచ్చేవారు. దీని వల్ల ఆలయానికి ఆదాయం సమకూరేది. అమ్మవారి ఉత్సవాల సమయంలో జాతర నిర్వహణ పనులన్నీ అక్కడే జరిగేవి. ప్రసాదాల తయారీ నుంచి సమావేశాల నిర్వహణ, ఇతర ఏర్పాట్లు అక్కడి నుంచే చేసేవారు. ఆలయానికి సమీపంలో ఈ కల్యాణ మండపం ఉండడం వల్ల అన్నిరకాల కార్యకలాపాలు నిర్వహించేవారు. గత కొంత కాలంగా కల్యాణ మండపం నిర్వహణ గాడి తప్పింది. అక్కడి ఈవో కార్యాలయం, ఇతర సిబ్బంది కార్యకలాపాలను ఆలయ వెనుక భాగానికి మార్చారు. అక్కడే నిత్యాన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నారు. దీంతో కల్యాణ మండపాన్ని ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు. అప్పుడప్పుడు అమ్మవారి హుండీల లెక్కింపు చేపడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు.

అధ్వానంగా పరిసరాలు..

ప్రస్తుతం ఆ భవనం నిర్వహణ లేకపోవడం వల్ల శ్లాబు పెచ్చులు ఊడిపోతున్నాయని... అందుకే కార్యాలయాలను మార్చినట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కల్యాణ మండపం, పరిసరాలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలకు కూలిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, పశువులు దర్శనమిస్తున్నాయి. లోపలికి వెళ్లే ద్వారానికి తాళాలు వేసి ఉన్నాయి. మరికొద్ది రోజుల్లో జరగనున్న పైడిమాంబ జాతర సమయంలో కూడా ఈ కల్యాణ మండపం వినియోగంలోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎంతో మందికి వసతి, ఇతర సౌకర్యాల కల్పనకు సౌలభ్యంగా ఉండే ఈ భవనాన్ని అధికారులు నిరుపయోగంగా వదిలేయడం వల్ల నిర్వహణ ఖర్చులు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. పైడిమాంబ దీక్షాధారులకు కూడా ఈ మండపం ఉపయోగపడేది. ప్రస్తుతం వారికి ఉపయోగపడడం లేదు. ఈ భవనం గత ఏడాదిగా నిరుపయోగంగా ఉందని... శ్లాబు పెచ్చులూడడం వల్ల అందులో కార్యకలాపాలు చేపట్టడం లేదని అధికారులు అంటున్నారు. దీని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్టు చెబుతున్నారు.



కల్యాణ మండపం గేటుకు తాళం వేసిన దృశ్యం

రేపు మెగా జాబ్‌మేళా

శృంగవరపుకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డా.కేశవరావు, జేకేసీ కోఆర్డినేటర్ ఈరన్న తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 18 నుంచి 35 ఏళ్ల దాటి పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 7995691295ను సంప్రదించాలని కోరారు.

పైడిమాంబ ఆలయం ఎదుట తాటాకు పందిరి

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవంలో భాగంగా అమ్మవారి ఆలయం ఎదుట ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా అమ్మవారికి చల్లదనం కోసం తాటాకు పందిళ్లు వేయడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గురువారం ఆలయం ఎదురుగా ఈ తాటాకు పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. నెల రోజుల పాటు ఈ పందిళ్లు ఉంటాయి.

రేపు ఉచిత వైద్య పరీక్షలు

చీపురుపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోరాడ శంకరరావు, ప్రతినిధి ఎస్.సన్యాసిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంజనేయపురంలోని పల్లా వెంకయ్య ఆసుపత్రిలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే



స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి సంధ్యారాణితో ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును మంత్రి గుమ్మడి సంధ్యారాణితో పాటు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం శాసన సభ సమావేశాలకు హాజరైన సందర్భంగా కలిసి, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధితోపాటు సమస్యలను ప్రస్తావించారు.

విశాఖ ఎంపీని కలిసిన దాసరి కార్పొరేషన్ చైర్మన్

శృంగవరపుకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకటరత్నాజీ గురువారం కలిశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ ప్రసాద్ ఉన్నారు. ఆదివారం కొత్తవలసలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావాలని కోరారు. వారి వెంట కొత్తవలస పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను ఉన్నారు.

కలెక్టర్ దృష్టికి మండల సమస్యలు

భోగాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం టీడీపీ భోగాపురం మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలిశారు. ఆయనను దుస్సాలువాతో సత్కరించారు. మండలానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రోతు రాజు, నీలాపు అప్పలరామిరెడ్డి, కోలా రామసూరి, పిడుగు తోటారావు, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

రేపు అమ్మవారి హుండీ లెక్కింపు

రాజాం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం ఈనెల 20న ఉదయం 10 గంటలకు విజయనగరానికి చెందిన దేవదాయ శాఖ తనిఖీ అధికారి పర్యవేక్షణలో నిర్వహిస్తామని ఈవో బీవీ మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ, గ్రామ పెద్దల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రేపు ఉరుసు ఉత్సవం

విజయనగరం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కుమందన్ వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ ఉల్లే మీర్ షా బాబా 38వ ఉరుసు ఉత్సవాన్ని ఈనెల 20న నిర్వహించనున్నట్టు దర్గా కమిటీ అధ్యక్షుడు ఎస్.దాదా, ఎస్‌కే జానీలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని, సాయంత్రం దర్గా నుంచి నగర వీధుల్లో బాబా చందనోత్సవాన్ని ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఈకేవైసీ ఉంటేనే ఉపాధి పని

లక్కవరపుకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పని చేయాలనుకునే వారు ఇకపై తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఏపీవో విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు, ఆధార్, రేషన్‌కు ఎలాగైతే ఈకేవైసీ అవసరమో ఉపాధిహామీ పథకానికి కూడా ప్రభుత్వం ఈకేవైసీ తప్పనిసరి చేసిందని ఆమె చెప్పారు. ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు గురువారం నుంచి ఉపాధి కూలీల వద్ద ఈకేవైసీ తీసుకుంటున్నారు. మండలంలో సుమారు 11వేల మందికిపైగా ఉపాధి కూలీలు ఉన్నారు. వీరందరికీ ఈకేవైసీ చేస్తామని తెలిపారు. ఈ విషయం జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ గమనించాలని ఏపీవో కోరారు.

సంకిలి వంతెనపై జాగ్రత్త సుమీ..

- అడుగడుగునా గోతులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రేగిడి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాలకొండ- విశాఖ ప్రధాన రహదారిలో ఉమ్మడి జిల్లాలను కలిపే అతి ముఖ్యమైన మార్గం.. రేగిడి మండలం సంకిలి గ్రామం వద్ద నాగావళి నదిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. దాదాపు వందేళ్లు ఉండాలన్న ప్రణాళికతో అప్పటి ఇంజనీరింగ్ అధికారులు ఐదు దశాబ్దాల కిందట ఈ వంతెనను నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెనను చూస్తే వాహనదారులకు భయమేస్తోంది. అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయి. మరో వైపు వర్షపునీరు పోయే రంధ్రాలు మూసుకుపోయాయి. దీంతో వర్షా కాలంలో నీరు నిలిచిపోతోంది. వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. వంతెన నిర్వహణను ఆర్‌అండ్‌బీ అధికారులు గాలికొదిలేశారు. దీంతో ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న సంకిలి వంతెన

బార్లకు లాటరీ ప్రక్రియ పూర్తి



బార్లకు లాటరీ తీస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీ 2025-28 ప్రక్రియలో భాగంగా జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు బార్లకు కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద లాటరీ తీశారు. మొత్తం 16 దరఖాస్తులకు 81 లక్షల 6 వేల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం లభించినట్టు జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరిడెంట్‌ంట్ బమ్మిడి శ్రీనాథుడు తెలిపారు. ఈ ప్రక్రియలో కలెక్టర్‌తో పాటు జేసీ సేతుమాధవన్, ఎక్సైజ్ డీసీ శ్రీనివాసచౌదరి, ఎక్సైజ్ అధికారులు, బార్లు యాజమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొఠారుబిల్లి జంక్షన్, కొఠారుబిల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ టౌన్ డీఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామవరం రూరల్ ఫీడర్ పరిధిలో వైర్ల కింద చెట్ల కొమ్మలు తొలగించడం కోసం విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు.

రేపు విజయనగరంలో..

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసన్నపేట 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఈనెల 20న శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.త్రినాథ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా దాసన్నపేట, ఓరుగంటి వారు తోట, రైతుబజారు, అయ్యన్న కోనేరు గట్టు, శంకరమఠం, మహారాణి పేట, సుంకరవీధి, గెడ్డవీధి, తురకల చెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయన్నుట్టు తెలిపారు.

బీఎల్వోలతో సమావేశం

జామి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలానికి నూతనంగా వచ్చిన బీఎల్వోతో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి ప్రమీల గురువారం జామిలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు విషయాలను వారికి వివరించారు. వారు నిర్వహించాల్సిన విధులు ఇతర కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణంరాజు, ఉప తహసీల్దార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల వితరణ

రేగిడి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులకు వసుధైక కుటుంబం ఫౌండేషన్, కెనరా బ్యాంకు బాసటగా నిలిచాయి. గురువారం స్థానిక పాఠశాలలో వీరికి సైకిళ్లు పంపిణీ చేయడంతోపాటు ఉపకార వేతనాలు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై చర్చించాలి

నెల్లిమర్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్ మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక మొయిద జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపటు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



భోగాపురం: సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

భోగాపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరంగా రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలంటూ దస్తావేజు లేఖర్లు శుక్రవారం నుంచి రెండు రోజులపాటు పెన్‌డౌన్ చేస్తున్నారు. ఈమేరకు గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ పి.రామకృష్ణకు వారు వినతిపత్రం అందజేశారు. ● కొత్తవలస, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గల కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాలకు చెందిన దస్తావేజు లేఖర్లు శుక్ర, శనివారాలలో పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు కొత్తవలస సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు సంఘం ప్రతినిధి ఐతంశెటి శివప్రసాద్ గురువారం తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ పవర్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ భవనం వద్ద మధ్యాహ్నభోజన సమయంలో విద్యుత్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ సురగాల లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్యం అందించాలన్నారు. 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 వరకూ నియమించిన ఉద్యోగులందరికీ జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్‌ను వర్తింపచేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసి, పదోన్నతులు కల్పించాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు అల్లు శంకరరావు, అప్పలస్వామినాయుడు, నిర్మలామూర్తి, పూసపాటి సీతారామరాజు, నర్సింగరావు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధిగ్రస్థులకు న్యాయ సహాయం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో 'మానసిక వ్యాధిగ్రస్థులకు ఉచిత న్యాయ సహాయం' అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సివిల్ న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. న్యాయ సేవల అధికార చట్టంలో సెక్షన్ 12డీ ప్రకారం మానసిక అనారోగ్యం, ఇతర వైకల్యం ఉన్న వ్యక్తులు కేసులు దాఖలు చేయడానికి గానీ వాదించడానికి గానీ ఉచిత న్యాయ సలహాలు పొందేందుకు అర్హులన్నారు. మానసిక ఆసుపత్రి, మానసిన నర్సింగ్ హోంలో నిర్బంధంలో ఉన్న వారందరికీ ఈ హక్కు వర్తిస్తుందన్నారు. ఈసందర్భంగా వ్యాధిగ్రస్తులను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, రోగుల విషయాలను ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిడెంట్‌ంట్ డా.పద్మజ, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి కె.సూర్యనారాయణ, సైక్రియార్టిస్ట్ కె.శారద, ఎ.కరుణ, వన్‌టౌన్ ఎస్‌ఐ రవి, న్యాయవాదులు తాడి రాజు, బాలమురళీలు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏపీపీ రమణమ్మ

గజపతినగరం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లల విద్యతోపాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణమ్మ అన్నారు. గురువారం గజపతినగరం బజార్ సెంటర్‌లోగల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బ్యాడ్‌టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాభివృద్ధితో పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. హెచ్ఎం సన్యాసిరావు, న్యాయవాదులు సాయిశేఖర్, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో చీపురుపల్లి విద్యార్థినుల ప్రతిభ



కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరచిన చీపురుపల్లి జట్టు

చీపురుపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన జోనల్ స్థాయి ప్రభుత్వ కళాశాలల కబడ్డీ పోటీల్లో చీపురుపల్లి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విశాఖ ఉమెన్స్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న చీపురుపల్లి ఉమెన్స్ జట్టు జోనల్ స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. కాగా, జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉమన్స్ జట్టును కళాశాల ప్రిన్సిపాల్ వీవీఆర్ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, ఐక్యూ ఏసీ సమన్వయకర్త జ్వాలాముఖి అభినందించారు.

రాజ్యాంగబద్ధంగా గ్రామసభలు నిర్వహించాలి

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా గ్రామ సభలు నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక అధ్యక్షులు డి.సూర్యారావు, ఆర్.సూర్యదేముడు డిమాండ్ చేశారు. గ్రామసభను సక్రమంగా నిర్వహించాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారికి గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జిల్లాలో ని 777 పంచాయతీల్లో గ్రామసభలు రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని కోరారు. గ్రామసభల నిర్వహణలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఓటరు అక్షరాస్యత వేదిక ప్రతినిధి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ భూములు కొనుగోలు చేయొద్దు



నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ భూములను కొనుగోలు చేసి ఎవరూ మోసపోవద్దని.. ఈ సంస్థకు తాము భూములు ఇచ్చి మోసపోయి కుటుంబాలతో రోడ్డున పడ్డామని జిందాల్ నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. బొడ్డవర గ్రామంలో 89వ రోజు గురువారం వారంతా జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

బారులు తీరారు

- యూరియా కోసం రైతుల అవస్థలు

సంతకవిటి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక ట్రేడర్స్ వద్ద గురువారం యూరియా పంపిణీ చేయగా, రైతులు బారులు తీరారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు క్యూలైన్‌లో నిలబడుతూ ఎరువుల కోసం ఆపసోపాలు పడ్డారు. ఇప్పటి కైనా పూర్తి స్థాయిలో యూరియా అందజేయా లని రైతులు కోరుతున్నారు.



సంతకవిటి: యూరియా కోసం బారులు తీరిన రైతులు

పంపిణీ వాయిదాపై ఆందోళన

దత్తిరాజేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెదకాద గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద గురువారం రైతులు యూరియా కోసం ఆందోళన చేపట్టారు. రైతుసేవా కేంద్రంలో యూరియా ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల గురువారం యూరియాను పంపిణీ చేయలేకపోతున్నామని సిబ్బంది చెప్పారు. దీంతో యూరియా అందకపోతే పంటలు నష్టపోతామని.. పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వరి దుబ్బులు పట్టుకుని నిరసన చేశారు. విషయం తెలుసుకుని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులతో మాట్లాడారు. యూరియా పంపిణీకి కోడ్ రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పడంతో వివాదం సద్దుమనిగి రైతులు శాంతించారు.



వరి దుబ్బులతో ఆందోళన చేస్తున్న రైతు

క్షణికావేశంతో కొడుకు దాడి

- మృతిచెందిన తండ్రి



అప్పలస్వామి (ఫైల్)

తెర్లాం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎంఆర్ అగ్రహారంలో గురువారం విషాదం చోటుచేసుకుంది. ఓ కొడుకు తన తండ్రిని రాయితో కొట్టి చంపేశాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరపు అప్పలస్వామి(75)కి ఇద్దరు కూమారులు ఉన్నారు. పెద్ద కూమారుడు సత్యం వ్యవసాయం చేస్తుంటాడు. రెండో కూమారుడు శంకరారావుకు వివాహమైంది. అయితే భార్యతో కలిసి ఉండటంలేదు. కొన్నాళ్లుగా అన్నయ్యతో కలిసి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొద్ది రోజులుగా తన తండ్రి తనను సక్రమంగా చూడక పోవడమే కాకుండా తనపై ఎందుకు ఊరంతా చెడుగా చెబుతున్నారని శంకరరావు బుధవారం తన తండ్రిని ప్రశ్నించాడు. దాంతో తండ్రి, కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో శంకరరావు తన తండ్రిపై రాయిని విసిరికొట్టాడు. అది తండ్రి తలకు బలంగా తగిలింది. దాంతో అధికంగా రక్తస్రావమైంది. విషయం గమనించిన అప్పలస్వామి మనువరాలు కల్పన.. తెర్లాంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో గురువారం అప్పలస్వామి మృతిచెందాడు. మనువరాలు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నారాయణరావు, ఎస్ఐ సాగర్‌బాబు రంగంలోకి దిగి క్యూస్ టీంతో ఆధారాలను సేకరించారు. ఈ ఘటనపై సీఐ కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో ఉద్యోగి అరెస్టు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గోపాలరాయుడుపేటకు చెందిన రెవెన్యూ శాఖ ఉద్యోగిపై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం రాత్రి అరెస్టు చేశామని డీఎస్పీ భవ్యరెడ్డి తెలిపారు. ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగికంగా వేధించినందుకు ఆయనపై బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. అయితే నిందితుడి పేరు డీఎస్పీ వెల్లడించలేదు.

లారీ ఢీకొని రెండు ఎద్దుల మృతి

సీతానగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాశయ్యపేట పెట్రోల్ బంకు వద్ద గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు నాటు బండ్లను లారీ ఢీకొట్టింది. దాంతో రెండు ఎద్దు మృతిచెందాయి. ఈ ఘటనలో ముందు వెళ్తున్న నాటు బండి యజమాని తిరుపతిరావుకు చెందిన ఒక ఎద్దు, రెండో నాటు బండి యజమాని పెంట పోలినాయుడుకు చెందిన మరొక ఎద్దు ఘటన స్థలంలోనే మృతిచెందాయి. జగ్గునాయుడుపేట నుంచి ఇసుక తీసుకుని వెళ్లడానికి సీతానగరం నుంచి నాటు బండ్లు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. పార్వతీపురం వైపు నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో తిరుపతిరావుకు చిన్న గాయాలు తగలడంతో పార్వతీపురం కేంద్రాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.రాజేష్ కేసు నమోదు చేశారు.

నమ్మించి మోసం చేశాడు

సంతకవిటి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేసిన యువకుడిపై ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు గురువారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి.. అదే గ్రామానికి చెందిన ఓ ఉద్యోగినిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. ఈక్రమంలో ఆమె గర్భం కూడా దాల్చింది. దీంతో ఆమె గురువారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల స్వైర విహారం

- ఆరుగురికి గాయాలు

మెంటాడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెంటాడలో కుక్కలు స్వైర విహారం చేశాయి. గురువారం స్థానికులపై దాడి చేశాయి. ఈ దాడిలో ఎం.సందీప్, కె.అప్పలనాయుడు, చరణ్‌తేజ, పి.శంకరరావు, సాయిచరణ్ తేజవర్ధన్, ఎం.జయలక్ష్మీ గాయాలపాలయ్యారు. వారంతా స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రామన్నపేట గ్రామంలో గురువారం నిర్వహించిన దాడిలో 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ జనార్దనరావు తెలిపారు. గ్రామానికి చెందిన వి.లక్ష్మయ్య ఇంటి వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. సర్కిల్ పరిధిలో ఇంతవరకు 144 బెల్టు షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేయగా 263 లీటర్ల మద్యం, 6.5 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నారని ఆయన వివరించారు. ఎస్ఐ పి.శాంతి, హెచ్‌సీ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి వివరాలపై ఇంటింటి సర్వే

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకుని రావాలన్న అధికారుల ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా గురువారం ఇంటింటి సర్వే చేపట్టారు. నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య సూచనలతో సచివాలయ కార్యదర్శులు, నగరపాలక సంస్థ సిబ్బంది టీంలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఆస్తి వివరాలను, కొలతలను సేకరిస్తున్నారు. సచివాలయ అడ్మిన్, ఎమ్యూనిటీస్, ప్లానింగు, ఉమెన్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కార్యదర్శులతో పాటు కార్యాలయ సిబ్బంది ఒక టీంగా ఏర్పడి సర్వేలో పాల్గొంటున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకు రావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంటింటి సర్వే చేపట్టామని తెలిపారు. అక్టోబరు 10లోగా సర్వే పూర్తి చేసి నివేదిక సమర్పించాలని కోరారు.

భూపాలరాజపురం సర్పంచ్‌పై ఫిర్యాదు

దత్తిరాజేరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన భూపాలరాజపురం వైసీపీ సర్పంచ్ నైరేడిబిల్లి గురునాయుడుపై జనసేన పార్టీ నాయకులు మానాపురం పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన నిధులు అక్రమార్గం పట్టినట్టు సాక్షాధారాలు లేని నిందలు వేస్తూ సెల్ఫీ వీడియో వాట్సాప్‌లో వైరల్ చేసిన గురునాయుడుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మామిడి దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు మునకాల జగన్ తదితరులు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025-26 ఏడాదికి గాను నాలుగో విడత ప్రవేశాల కోసం వివిధ ట్రేడ్లలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 27వ తేదీ రాత్రి 11.50 గంటలు లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం దగ్గరలో గల ప్రభుత్వ ఐటీఐలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోగా హాజరు కావాలన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు కుల ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, ఆధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్ నెంబరు, టీసీ, పాస్‌పోర్టుసైజ్ ఫోటో తీసుకొని 29వ తేదీన ఉదయం 9 గంటలకు రాజాం ప్రభుత్వ ఐటీఐలో నాలుగో విడత అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 9000096048, 8309438446 నెంబర్లుకు సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రాధాన్యం ఇస్తామని మరిచారు

శృంగవరపుకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీలో చేరే సమయంలో తమకు తగిన ప్రాధాన్యం ఇస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారని, కానీ ప్రస్తుతం అందుకు విరుద్ధంగా జరుగుతుందని రాష్ట్ర టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి వర్గీయులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. పార్టీలో చేరే సమయంలో నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.. కానీ అందుకు విరుద్ధంగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సండి సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, ఎంపీటీసీ వాకాడ సింహాచలం, మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, నాయకులు బోజంకి గోవింద, కారుకొండు వెంకటరావు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం పరిశీలన

విజయనగరం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని 30వ డివిజన్ పరిధిలో గల బీసీ బాలుర వసతి గృహంలో బుధవారం రాత్రి కలుషిత ఆహారం తినడంతో 14 మంది అస్వస్థతకు గురయ్యారు. వారికి స్థానిక పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదేశాలతో టీడీపీ నియోజకవర్గ నాయకులు ప్రసాదుల ప్రసాద్, కంది మురళీనాయుడు, గంటా రవి, అనురాధబేగం, కోండ్రు శ్రీనివాస్, కుటుంబ రావు, ఆదిబాబు విద్యార్థులను పరామర్శించారు. జరిగిన విషయాన్ని తెలుసుకుని, ఎమ్మెల్యేకు వివరించారు.

పట్టణ వాసులకు ఆహ్లాదం ఎక్కడ?

●జిల్లా కేంద్రంలో ఒకే ఉద్యానవనం ●వృథాగా పార్కులకు కేటాయించిన స్థలాలు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ పరిసరాల శుభ్రత, పర్యావరణాన్ని కాపాడుదామనే పాలకులు పట్టణంలోని ఉద్యానవనాల అభివృద్ధిపై దృష్టి సారించడంలేదు. దీంతో పట్టణవాసులకు ఆహ్లాదం కరువైంది. మన్యం జిల్లా కేంద్రంలోని 80 వేల మంది జనాభాకు బెలగాం చర్చి వీధిలోని ఒకే పార్కు ఉంది. ఆ పార్కు కూడా మున్సిపాల్టీ ఆవిర్భావ సమయంలో ఏర్పాటైంది. పట్టణం చుట్టూ పక్కల ఈ 15 ఏళ్లలో నాలుగు కాలనీలు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ, సౌందర్య నారాయణమూర్తి నగర్ కాలనీల్లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు వృథాగా ఉన్నాయి. పార్కుల అభివృద్ధికి రూ.లక్షలు కేటాయించామని గత వైసీపీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకపోవడం విచారకరం. ●ఈ విషయమై మున్సిపల్ ఏఈ సన్యాసరావును వివరణ కోరగా పార్కుల అభివృద్ధికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



శత్రుచర్ల రియల్ ఎస్టేట్‌లో పార్కుకు కేటాయించిన స్థలం

సిద్ధమవుతున్న సీతానగరం వంతెన

(5వ పేజీ తరువాయి)

వేగావతి నదిపై చేపడుతున్న కొత్త వంతెన నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఒక్కొక్కసారి సుమారు రెండు నుంచి మూడు గంటల వరకు వంతెనపై వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల మన్యం జిల్లా నుంచి విజయనగరం వైపు వెళ్తున్న ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.13.40కోట్లు మంజూరు చేసింది. పారాది వంతెన నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

మినీ వంతెన కల నెరవేరేదెప్పుడో?

(5వ పేజీ తరువాయి)

పైనుంచే తీసుకెళ్తారు. వర్షాలు ఎక్కువగా కురిస్తే ఈ కాజ్‌వే పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. అప్పుడు పూర్తిగా ఈ 30 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచం నుంచి సంబంధాలు తెగిపోతాయి. ఆ సమయంలో తమ జీవనం దుర్భరంగా ఉంటుందని ఆయా గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టాలు తీరెదెన్నడో?

వట్టిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం 1976లో జరిగింది. అప్పటి నుంచి వీరికి ఈ కష్టాలు తప్పడం లేదు. తూర్పు ఏజెన్సీ ప్రాంతం వైపు వెళ్లే ప్రధాన రహదారి రిజర్వాయర్ దిగువ నుంచే వెళుతుంది. దిగువనున్న కాజ్‌వే పైనుంచే గిరిజనులు ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలతో బయట ప్రపంచానికి వచ్చి తమ వద్ద ఉన్న పండ్లు, కూరగాయలను అమ్ముతూ వారికి కావల్సిన సరుకులను తీసుకెళుతూ ఉంటారు. అయితే, కాజ్‌వేపై వరద ఉధృతమైతే అంతే సంగతులు. ఈ నీటి ప్రవాహం వెళ్లే ప్రాంతంలో శిఖబడి గ్రామం పక్కనే ఒక మినీ వంతెన, బొమ్మిక-బీజేపురం గ్రామాల మధ్య మరో వంతెన నిర్మించారు. అదీ కూడా నాగూరు నియోజకవర్గ శాసనసభ్యులుగా నిమ్మక జయరాజు ఉన్న సమయంలో నిర్మించారు. కానీ తరువాత వచ్చిన ఎమ్మెల్యేలు మాత్రం కనీసం ఈ తూర్పు ఏజెన్సీకి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువన మినీ వంతెన నిర్మాణం మాత్రం చేయించలేకపోయారని ఈ ప్రాంత గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా టరు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి పెద్దలు ఒక్కసారి మా పరిస్థితిని చూసి మినీ వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

చాలా అవసరం



వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువన ప్రధాన రహదారిపై మినీ వంతెన ఏర్పాటు చాలా అవసరం. ఈ విషయంపై గతంలో ఎంతోమంది కలెక్టర్లకు, ప్రభుత్వ పెద్దలకు లిఖిత పూర్వకంగా లేఖలు రాసి పరిష్కరించాలని కోరాను. హామీలు ఇచ్చారు గాని కార్యరూపం దాల్చలేదు.

-నిమ్మక జయరాజు, మాజీ ఎమ్మెల్యే, కురుపాం నియోజకవర్గం

ఇబ్బందులు పడుతున్నాం



మా తూర్పు ప్రాంత ఏజెన్సీ గిరిజన గ్రామాల ప్రజలు వర్షాలు వస్తే చాలా ఇబ్బందులు పడుతున్నారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ దిగువన వరద ఉధృతంగా ప్రవహిస్తుండటం వల్ల ఎక్కడికి వెళ్లలేకపోతున్నారు. వెంటనే మినీ వంతెనకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి.

-ఆరిక చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు, ఏపీ గిరిజనాభ్యుదయ సంఘం

పారదర్శకంగా బార్ల కేటాయింపు

(5వ పేజీ తరువాయి)

నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకుడు రామచంద్రరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వ శాఖల్లో నిర్దేశించిన లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలు, ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్, విద్య, విద్యుత్, మున్సిపాలిటీలు తదితర శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. వ్యవసాయ, ఉద్యానవ రంగాల్లో బహుళ పంటల దిశగా ఆలోచన చేయాలని, తద్వారా రైతులు అధిక ఆదాయం పొందాలని అన్నారు. భూసార పరీక్షలు ప్రతి రైతు పొలంలో కూడా చేయాలని, ఇందుకు తగిన విధంగా ల్యాబ్‌లు ఉండాలన్నారు. రబీలో పంటలను ప్రోత్సహించాలని అన్నారు. అటవీ సంపద, పశు సంపద మరింత వృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో జేసీతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశుసంవర్ధకశాఖ అధికారులు కె.రాబర్ట్‌పాల్, టి.సంతోష్‌కుమార్, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పీఆర్‌సీ జీతాలు చెల్లించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు పీఆర్‌సీ జీతాలు చెల్లించాలని నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు గురువారం నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ అమలు కోసం ఈ నెల 23న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలన్నారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజుకు వినతిప త్రం అందించారు. నిరసనలో సంజీవి, వేణు, సురేష్, శ్రీదేవి, విమల, ఆంజనేయులు ఉన్నారు.

ఆరోగ్య విధానాలపై అవగాహన కల్పించండి

గరుగుబిల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆరోగ్య విధానాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. గురువారం గొట్టివలస, పెద్దూరుల్లో రాష్ట్రీయ పోషణ అభియాన్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అక్టోబరు 16 వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు, కార్యదర్శి బి.అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలులో పెట్రోల్ బంకు వద్దు

బొబ్బిలి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలు ప్రాంగణంలో పెట్రోలు బంకు ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని స్థానికులు ఆర్డీవో రామ్మోహనరావు, తహసీల్దారు మలపరెడ్డి శ్రీనుకు గురువారం వినతిపత్రాలను అందజేశారు. పట్టణ నడిబొడ్డున సబ్ జైలు ఉందని, దాని పరిసరాల్లో నివాస ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసుస్టేషన్, విద్యాలయాలు ఉన్నందున ఏదైనా ప్రమాదం జరిగితే అందరికీ ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ ప్రతిపా దనను విరమించుకోవాలని అధికారులను కోరారు. దీనిపై ఆర్డీవో స్పం దిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో మున్సిపల్ కౌన్సిలరు మరిపి తిరుపతిరావు, సాలా రమేష్, టీవీ బాస్కరరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

కష్టపడిన వారికే ప్రాధాన్యం



మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన వారికే భవిష్యత్‌లో ప్రాధాన్యం ఉంటుందని అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. గురువారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి అధ్యక్షతన నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం క్షేత్రస్థాయిలోనూ కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు, శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణ, నియోజకవర్గ నాయకులు కర్నేన అప్పలనాయుడు, రవినాయుడు, గంటా సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంతిళ్లు కల్పించడమే ధ్యేయం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హౌసింగ్ ఈఈ

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ డివిజన్‌లో పేదలు, బలహీనవర్గాలు, మధ్య తరగతి కుటుంబాలకు సొంతిళ్లు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని హౌసింగ్ ఈఈ జి.రవి అన్నారు. గురువారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో ఆయన అంగీకార్-2025 కరపత్రికలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 పట్టణ ప్రజల విభిన్న గృహవసరాలను తీరుస్తుందన్నారు. మున్సిపల్ కమిషనర్ రత్నంరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజనీర్ యు.సుధారాణి, హౌసింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్చరీలో సత్తాచాటిన విద్యార్థులు

సీతానగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో నిర్వహించిన ఆర్చరీ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. గురువారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన ఆకుల కామర్స్, పి.రంజిత్, బొంగు భానుప్రసాద్, సింగరోతు గౌరీశంకర్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

అరుణ్‌కు అభినందనలు



అరుణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి పాలవలస అరుణ్‌ను హెచ్‌ఎం జామి రవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు షైమావతి, ఉపాధ్యాయులు బడి సింహాచలం గురువారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ విష్ణుమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాయత్రీనగర్, యాలాం సెంటర్, సీతంపేట రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, నీలమ్మకాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి, ఎం.ఎం.నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

●సీతానగరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈఈ పి.విశ్వేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతానగరం, పెదభోగిలి, బుడ్డిపేట, బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి, కొత్తవలస గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉండదన్నారు. అలాగే బూర్జ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బూర్జ, కృష్ణారాయపురం, పెదంకలాం, చినంకలాం, సుమిత్రాపురం, కామందొరవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సాలూరులో స్వచ్ఛతా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాలూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం మున్సిపల్ కమిషనర్ టి.రత్నాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయం నుంచి స్థానిక బోసు బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు, డబ్బివీధి, గాడివీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదికర్మ యోగి'తో గ్రామాల అభివృద్ధి

కొమరాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆదికర్మ యోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో ఎస్.రమేష్ అన్నారు. మండలంలో దేవుకోన, పూర్ణపాడు గ్రామాల్లో గురువారం ఆదికర్మ యోగిపై ర్యాలీ చేశారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించారు. రోడ్లు, కాలువలు, ప్రహరీల నిర్మాణానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుగుణకుమారి, డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ, సర్పంచ్ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదాంబ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన కల్పించండి

మక్కువ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ చట్టాలపై అందరికీ అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.అర్జునరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాలిక సంరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, గృహహింస, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా 112, 1098 నెంబర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీని కలిసిన ఎన్‌జీవోలు

పార్వతీపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డిలను గురువారం కలెక్టరేట్‌లో ఏపీ ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు జి.వి.ఆర్.ఎస్.కిశోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎన్‌జీవో సంఘ నాయకులు ఉన్నారు

ఆటో కార్మికులకు న్యాయం చేయండి

సాలూరు, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోయిన ఆటో కార్మికులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మామిడి పల్లి, శివాజీ బొమ్మ జంక్షన్, కొత్తవలస, మాతుమూరు, పి.కోనవలస, ఆర్‌బీ.పురం ఆటో స్టాండ్ల కమిటీ నాయకులు రమేష్, సోమేశు, శ్రీని వాసరావు, జగ్గారావు, గుణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

●మక్కువ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాహన మిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు ఈఏడాదికి రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కె.భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మక్కువ ఆటో యూనియన్ నాయకులు మామిడి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

●పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ యూనియన్ పాలకొండ కమిటీ అధ్యక్షుడు కాద రాము డిమాండ్ చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాపారావు, సింహాచలం, దుర్గారావు, సురేష్, గురువులు తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు అంకితభావం అవసరం



మాట్లాడుతున్న హెచ్‌ఎం అరుణ

కురుపాం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని లంకాజోడులోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.అరుణ అన్నారు. గురువారం పాఠశాలలో సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచుకునేటట్లు బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. దసరా సెలవులకు ముందు తల్లిదండ్రుల సమావేశం పెట్టి సూచనలు చేయాలన్నారు. సమావేశంలో సంక్షేమాధికారి టి.రేవతి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న పోస్టల్ సూపరింటెండెంట్

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్వతీపురం మన్యం జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.బాబురావు కోరారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పాత బస్టాండ్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు పోస్టల్ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా పర్యావరణాన్ని రక్షించుకుంటే భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛ వాతావరణాన్ని అందించగలిగే అవకాశం ఉంటుందన్నారు. పరిసరాల శుభ్రతను పాటించడంతో పాటు ప్రతిఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు.

మేదర్లను ఆదుకోండి



వెదురు దినోత్సవంలో మేదర సంఘ నాయకులు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): మేదర వృత్తిదారులను ప్రభుత్వమే ఆదుకోవాలని మేదర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, పి.కృష్ణ డిమాండ్ చేసారు. గురువారం పట్టణంలో ప్రపంచ వెదురు పుట్టుక దినోత్సవాన్ని పట్టణ మేదర సంక్షేమ సంఘం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరాలు మారుతున్నా మేదర్ల తలరాతలు మారడం లేదన్నారు.ప్రభుత్వం మేదర కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేదర సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.రామారావు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

పాలకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిరంజీవి, సీతంపేట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు, గైనకాలజిస్ట్ డాక్టర్ రౌతు భారతితో పాటు పలువురు వైద్యులు హాజరై 590 మందిని పరీక్షించారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి క్యాన్సర్, టీబీ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ కె.రవికుమార్, పరిపాలనా విభాగం అధికారులు సాకేత్‌కుమార్, గుంపుస్వామి పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ పెంచండి

బెలగాం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవాల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా, నియోజకవర్గ కమిటీలు వేసి బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం యూత్ ప్రెసిడెంట్ ముగడ జగన్మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ ఎస్వీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీదశలో పోషకాహారం తప్పనిసరి

కొమరాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జీవితంలోని ప్రతి దశలో తప్పనిసరిగా పోషకాహారం అవసరమని ఐసీడీఎస్ కొమరాడ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి అన్నారు. గురువారం మండలంలోని దేవుకోనలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీడీవో రమేష్, డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ, సూపర్‌వైజర్ శారదాంబ పాల్గొన్నారు.

సహజ ఎరువుల వినియోగంపై దృష్టిపెట్టండి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పారినాయుడు

గరుగుబిల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు సహజ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు సూచించారు. గురువారం తోటపల్లి జట్టు కార్యాలయ ఆవరణలో బయో ఉత్పత్తులపై మూడు జిల్లాలకు చెందిన కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం రైతులు పెంట గెత్తం, వేప పిండి, పచ్చిరొట్ట ఎరువులతో ఆరోగ్యకరమైన పంటలు పండించేవారన్నారు. ప్రస్తుతం ఎరువుల కోసం బారులు తీరుతున్నారన్నారు. ప్రభుత్వం సుస్థిర వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేసేందుకు రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో బయో రిసోర్స్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రైతులకు అవసరమయ్యే సహజ ఎరువులు, కషాయాలు, ద్రావణాలను అందించేందుకు చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో రచయిత రౌతు వాసుదేవరావు, సినీ గేయ రచయిత టి.శివాజీ, రైతు సాధికార సంస్థ అధికారులు డి.మన్మోహన్, ప్రవీణ్, అన్నపూర్ణ, ప్రబోధ్, నూకంనాయుడు ఉన్నారు.